క్లుప్తంగా

విద్యుత్ ఉండని ప్రాంతాలు

శంషాబాద్: మరమ్మతుల కారణంగా 11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సంతోష్‌బాబు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆర్‌బీనగర్, ఆదర్శనగర్, రాళ్లగూడ, సిద్దంతి, నక్షత్ర కాలనీ, సింప్లెక్స్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న సంతోష్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజల ఆరోగ్య సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందని బీఆర్‌ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ సీనియర్ నాయకుడు సంతోష్‌గౌడ్ అన్నారు. బాబుల్‌రెడ్డినగర్‌లో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 200 మంది పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. వేల రూపాయల ఖర్చుతో కూడిన పరీక్షలను ఉచితంగా నిర్వహించి మందులు సైతం ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులపై అధికారుల సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న రత్నాకర్‌రావు

మైలార్‌దేవ్‌పల్లి: విద్యుత్ శాఖ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వినియోగదారులకు బిల్లులు అందజేసే విధంగా అధికారులు పని చేయాలని రాజేంద్రనగర్ విద్యుత్ డివిజన్ డివిజనల్ ఇంజనీర్ పి.రత్నాకర్‌రావు సూచించారు. గురువారం శివరాంపల్లిలోని రాజేంద్రనగర్ విద్యుత్ డివిజన్ కార్యాలయంలో ఏడీఈ, ఏఈ, ఏఏవో, జేఏవోలతో విద్యుత్ బిల్లుల సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నాకర్‌రావు మాట్లాడుతూ.. రీడింగ్ ప్రకారం బిల్లులు జారీ చేయాలని ఆదేశించారు. ఫిబ్రవరి నెల 28 రోజులే ఉంటుంది కాబట్టి 10వ తేదీలోపు బిల్లింగ్ పూర్తి చేసి కలెక్షన్స్‌పై దృష్టిసారించాలని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు ఈశ్వర్‌ప్రసాద్, సత్యనారాయణ, శ్రీనివాస్, నాగమణి, హరినాథచారి, హాథీరాం తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ కూలి వాహనాలు ధ్వంసం


ధ్వంసమైన వాహనాలు

మణికొండ: అపార్ట్‌మెంట్ ప్రహరీ కూలడంతో కార్లు, ద్విచక్ర వాహనాలు ధ్వంసం అయ్యాయి. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని సెక్రటేరియట్ కాలనీలో ఈ ఘటన చోటుచేసుకుంది. పక్కనే నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్ దీనికి కారణమని బాధితులు చెబుతున్నారు. పలుసార్లు వారికి చెప్పినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

'తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే'



గోల్కొండ: తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కురకుల కృష్ణ అన్నారు. కాంగ్రెస్ ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే రాష్ట్రానికి వస్తున్న దృష్ట్యా గురువారం ఆయన కార్వాన్‌లో పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ నిర్వహించిన భారత్ జోడో యాత్రకు దేశం నలుమూలల నుంచి భారీ స్పందన వచ్చిందన్నారు. ఈ యాత్ర విజయవంతం కావడం ప్రజల్లో కాంగ్రెస్‌కు ఉన్న ఆదరణను స్పష్టం చేసిందని ఆయన అన్నారు. రాష్ట్రంలో బీజేపీకి ఏమాత్రం బలం లేదని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం సైతం ప్రజల ఆదరణ కోల్పోయిందన్నారు. రవీందర్, మహిపాల్‌రెడ్డి, హమీద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అవిశ్వాసం అలజడి

- బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో వేడెక్కుతున్న రాజకీయాలు
- మేయర్‌పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్న కొందరు కార్పొరేటర్లు
- అవిశ్వాసం దిశగా అడుగులు


బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలు చర్చనీయాంశంగా మారాయి. ఏడాది కాలంగా మేయర్, కార్పొరేటర్లు రెండు వర్గాలుగా చీలిపోయారు. అప్పటి నుంచి మేయర్‌పై అవిశ్వాసం పెట్టాలని వైరివర్గం కార్పొరేటర్లు పట్టుదలతో ఉన్నారు. తాజాగా పాలకవర్గం కొలువుదీరి మూడేళ్లు పూర్తి కావడంతో అవిశ్వాస తీర్మాణం ప్రవేశపెట్టేందుకు కార్యాచరణ రూపొందించారు.

బీఆర్‌ఎస్ కార్పొరేటర్ల రహస్య సమావేశం..

వైరి వర్గంలోని అధికార బీఆర్‌ఎస్‌కు చెందిన కార్పొరేటర్లు ఇటీవల రహస్య సమావేశం నిర్వహించి ఎలా ముందుకెళ్లాలనే దానిపై చర్చించారు. అవిశ్వాసానికి కావాల్సిన సంఖ్యా బలాన్ని పెంచుకునే దిశగా ముందుకు సాగుతున్నారు. ప్రస్తుతం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 22 మంది కార్పొరేటర్లు ఉండగా, ఇందులో అధికార పార్టీ కార్పొరేటర్లు 14 మంది ఉన్నారు. ఐదు మంది కాంగ్రెస్ కార్పొరేటర్లు ఉండగా ఒకరు మరణించారు. ఇద్దరు బీజేపీ, ఒకరు ఎంఐఎం కార్పొరేట్లు ఉన్నారు.

ఫలించని ఎమ్మెల్యే, ఎంపీ ప్రయత్నాలు..

గతంలో అధికార పార్టీకి చెందిన కార్పొరేటర్లు రెండు వర్గాలుగా విడిపోయిన సమయంలో వారందరినీ ఒక్కతాటిపైకి తీసుకొచ్చేందుకు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి పలుమార్లు ప్రయత్నాలు చేశారు. అయితే కార్పొరేటర్ల చీలిక మాత్రం అలాగే కొనసాగుతోంది. తాజాగా మూడేళ్లు పూర్తయ్యి అవిశ్వాసానికి అవకాశం రావడంతో వైరి వర్గం కార్పొరేటర్లు వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే వైరి వర్గంలోని ఓ కార్పొరేటర్ భర్త మేయర్ పీఠంపై కన్నేసినట్లు తెలుస్తోంది. అవసరమైతే కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎం కార్పొరేటర్ల మద్దతు కూడగట్టే ప్రయత్నాలను వారు ముమ్మరం చేశారు.

బేరాలకు తెరలేపారంటూ ప్రచారం..

మేయర్ పీఠంపై కన్నేసిన ఓ జాతీయ పార్టీకి చెందిన కార్పొరేటర్ సైతం తెరవెనుక పావులు కదుపుతున్నారు. కార్పొరేటర్లను తనవైపు తిప్పుకొనేందుకు బేరసారాలకు తెరలేపారన్న ప్రచారం జరుగుతోంది. మేయర్ పదవి కోసం ఎంతైనా ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉన్నారనే మాటలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత మేయర్ వెంట ఉంటూ ఆయన సీటుకే ఎసరు పెట్టే ప్రయత్నాలు చేపట్టడం రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

మేయర్ వర్గంలోనూ అసంతృప్తి..

మేయర్ వర్గంలోనూ చీలికలు కనిపిస్తున్నాయి. అధికార పార్టీకి చెందిన ఓ కార్పొరేటర్ భర్త సైతం మేయర్ వ్యవహారశైలిని తప్పుబడుతున్నారు. మేయర్‌కు పాలనపై అవగాహన లేదని, ఎవరి మాటను లెక్కపెట్టడం లేదని కొందరితో వ్యాఖ్యానిస్తుండడం గమనార్హం. అధిష్టానం మాత్రం అవిశ్వాసానికి సమ్మతించేది లేదని చెబుతుండగా, క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. వైరి వర్గం మాత్రం అవిశ్వాస తీర్మానం కోసం సంతకాల సేకరణ చేపట్టినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్‌లో నెలకొన్న పరిణామాలను ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు.

ఎమ్మెల్యేపై ఎలాంటి అసంతృప్తి లేదు..

ఎమ్మెల్యేపై తమకు ఎలాంటి అసంతృప్తి లేదని, మూడుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేస్తే గెలుపు కోసం కృషి చేశామని ఓ కార్పొరేటర్ భర్త అన్నారు. ఇప్పుడూ ఆయన వెంటే ఉన్నామన్నారు. అయితే ఏ రోజూ ఆయన గెలుపు కోసం పనిచేయని ఒకరిద్దరి మాటలు విని మమ్మల్ని దూరం పెట్టడం బాధగా ఉందన్నారు. మేయర్ ఒంటిద్దు పోకడలతో కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి కుంటుపడిందని, పాలనపై పట్టులేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. మేయర్ వ్యవహారశైలిని పలుమార్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి


డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: అభివృద్ధి పనుల్లో ఎలాంటి లోపాలు లేకుండా చూడాల్సిన బాధ్యత కాంట్రాక్టర్లు, అధికారులపై ఉందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ అన్నారు. కార్పొరేషన్ 22వ డివిజన్ వినాయక్‌నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీ పైపులైన్ పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఎక్కువ కాలం మన్నిక ఉండేలా పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. స్థానికులు తమ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగస్వాములు కావాలని, పనులు ఎలా జరుగుతున్నాయో పరిశీలిస్తూ నాణ్యత లోపిస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కో ఆప్షన్ సభ్యుడు వెంకట్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించండి


నిరసన తెలుపుతున్న నెమలినగర్ వాసులు

మణికొండ: తాగేందుకు, వాడుకునేందుకు నీళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తమ సమస్యను వెంటనే పరిష్కరించాలని మణికొండ మున్సిపాలిటీ నెమలినగర్ వాసులు డిమాండ్ చేశారు. గురువారం వారు కాలనీలో కాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ నాయకుడు రుద్రకుమార్ మాట్లాడుతూ.. కాలనీలో గతంలో ఐదు బోర్లు ఉండగా నాలుగింటిలో నీరు లేక వట్టిపోయాయన్నారు. ఉన్న ఒక్క బోరు ఇటీవల వట్టి పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు జలమండలి, మున్సిపాలిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా పైప్‌లైన్ వేశారని, అయితే నీటిని మాత్రం సరఫరా చేయడం లేదన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి తాగునీరు సరఫరా చేయాలని, లేనిపక్షంలో జలమండలి కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు.

మూడో రోజుకు చేరిన రిలే దీక్షలు



శంషాబాద్: ఫ్లై ఓవర్‌ను పొడిగించాలంటూ శంషాబాద్ జేఏసీ నేతలు చేస్తున్న రిలే దీక్షలు గురువారం మూడో రోజుకు చేరాయి. దీక్షలో వివిధ పార్టీల నేతలతో పాటు ప్రజాసంఘాల నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. లక్ష్యం నెరవేరే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని జేఏసీ నేతలు పేర్కొన్నారు. అధికారుల తప్పిదంతో బ్రిడ్జి అలైన్‌మెంట్ మార్చారని ఆరోపించారు. కౌన్సిలర్ మేకల వెంకటేష్‌ముదిరాజ్, ముదిరాజ్ సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బైరమోని మల్లేష్‌ముదిరాజ్, మండల అధ్యక్షుడు మెరుగు సురేష్‌ముదిరాజ్, బీఎస్పీ రాజేంద్రనగర్ నియోజకవర్గ అధ్యక్షుడు రాచమల్ల జయసింహ పాల్గొన్నారు.

నేడు మరోసారి పనుల పరిశీలనకు..

ఎన్‌హెచ్‌ఏ ఉన్నతాధికారుల బృందం మరోసారి ఫ్లై ఓవర్ పనులను పరిశీలించేందుకు శుక్రవారం రానున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యేతో పాటు జేఏసీ నేతలతో కలిసి బ్రిడ్జి పనులపై చర్చించనున్నట్లు సమాచారం.

అభివృద్ధి పనుల పరిశీలన

గోల్కొండ: హకీంపేట్ దర్గా ప్రహరీ నిర్మాణ పనులను గురువారం కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన దర్గా నిర్వాహకులతో కలిసి దర్గా అభివృద్ధి పనుల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పురాతనమైన ఈ దర్గాకు ప్రతిరోజూ ఎందరో భక్తులు వస్తారన్నారు. పతి ఏటా ఉర్సు ఉత్సవాలను భారీ ఎత్తున నిర్వహించడం గొప్ప విషయమని ఆయన అన్నారు. ప్రభుత్వం, వక్ఫ్‌బోర్డు ద్వారా దర్గా అభివృద్ధికి నిధులు తెస్తున్నానని చెప్పారు. దర్గా స్థలాలను కబ్జా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దర్గాలో భక్తులకు అన్ని వసతులతో గదులు నిర్మిస్తామన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోండి



కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న వైస్ చైర్మన్ వెంకటేశ్‌యాదవ్

మణికొండ: ప్రజల కంటి సమస్యలను తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నార్సింగి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్, 7వ వార్డు కౌన్సిలర్ జి.అరుణజ్యోతి సూచించారు. గురువారం 7వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇటీవలి కాలంలో ఎక్కువ మందికి కంటి సమస్యలు వస్తున్న విషయాన్ని తెలుసుకుని రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి వార్డు పరిధిలో చేపట్టిందన్నారు. కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు, మందులను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు.

ఏసీపీకి శుభాకాంక్షలు

మణికొండ: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో కొత్తగా నార్సింగి ఏసీపీ డివిజన్‌గా మారడంతో పాటు గతంలో సీఐగా పనిచేసి వెళ్లిన జీవీ రమణగౌడ్ పదోన్నతితో ఇక్కడ నియామకం కావడంతో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు శుభాకాంక్షలు చెబుతున్నారు. గురువారం నార్సింగి మున్సిపల్ వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్, కోఆప్షన్ సభ్యుడు ప్రశాంత్‌యాదవ్‌తో పాటు గోపాల గణేష్, రాజుయాదవ్, మణికొండ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ ఉపాధ్యక్షుడు నీలేష్‌ప్రసాద్ దూబే, నాయకులు ప్రమోద్‌రెడ్డి, బాల్‌రెడ్డితో పాటు పలువురు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.


ఏసీపీ రమణగౌడ్‌ను కలిసిన నార్సింగి మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటేశ్‌యాదవ్ తదితరులు


ఏసీపీతో మణికొండ నాయకులు నీలేష్, ప్రమోద్‌రెడ్డి, బాల్‌రెడ్డి

కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, కౌన్సిలర్ వెంకటేష్

శంషాబాద్: ఆడపిల్లల తల్లిదండ్రులకు కల్యాణలక్ష్మి ఆర్థిక భరోసా కల్పిస్తోందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని బేగం ఫంక్షన్ హాల్‌లో శంషాబాద్ మున్సిపాలిటీ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన 200 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి పథకం ప్రారంభించిన తర్వాత బాల్య వివాహాలు తగ్గిపోయాయన్నారు. పేద కుంటుంబాలకు పెద్దన్నగా ఉంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ వారిని ఆదుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ భోగీశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రబోడలో 'ఆయుష్మాన్ భారత్' ప్రారంభం


ఆయుష్మాన్ భారత్ సెంటర్‌ను ప్రారంభించిన మల్లారెడ్డి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్‌లోని ఎర్రబోడ ప్రాంతంలో గురువారం ఆయుష్మాన్ భారత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం విషయంలో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసిందన్నారు. అనేక ఆస్పత్రుల్లో కోట్లాది రూపాయల మేర ఆరోగ్యశ్రీ బకాయిలు ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ అమలు చేసేందుకు అంగీకరించిందన్నారు. ఇందులో పేరు నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఐదు లక్షల రూపాయల వరకు హెల్త్ ఇన్సూరెన్స్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, కార్యదర్శి కొమురయ్య, రూరల్ జిల్లా ఉపాధ్యక్షుడు నందకిషోర్, సాబాద విజయ్‌కుమార్, సిద్ధేశ్వర్, కాకుళారం కృష్ణ, కాడెం మల్లేష్, పొట్ట హరి, సాయియాదవ్, రాజు, మల్లేష్, శ్రీరామ్ పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్ నిర్మాణంపై సరైన నిర్ణయం తీసుకుంటాం

- ఎన్‌హెచ్‌ఏ ప్రాంతీయ అధికారి ఎస్.కె కుశ్వహా
- సమస్యలను వివరించిన బీజేపీ, జేఏసీ నేతలు


నేషనల్ హైవే అథారిటీ ప్రాంతీయ అధికారికి సమస్యలు వివరిస్తున్న బీజేపీ నేతలు

శంషాబాద్: ఫ్లై ఓవర్ నిర్మాణం విషయంలో సరైన నిర్ణయం తీసుకుంటామని నేషనల్ హైవే అథారిటీ తెలంగాణ ప్రాంతీయ అధికారి ఎస్కే కుశ్వాహ అన్నారు. గురువారం ఆయన ఆర్ అండ్ బీ ఈఈ ధర్మారెడ్డితో కలిసి బ్రిడ్జి పనులు జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించి బీజేపీ, జేఏసీ నేతలతో మాట్లాడారు. జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్రం తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈ ఫ్లై ఓవర్ నిర్మాణంతో సిద్దంతి బస్తీ వద్ద ట్రాఫిక్ సమస్య ఉండదన్నారు. బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. గతంలో రూపొందించిన అలైన్‌మెంట్‌కు విరుద్ధంగా పనులు చేపడుతున్నారన్నారు. గతంలో సింప్లెక్స్ వరకు ప్రతిపాదించిన ఫ్లైఓవర్ సిద్దంతి వద్ద ముగుస్తుండడంతో ప్రమాదాలకు ఆస్కారం ఉంటుందన్నారు. స్థల సేకరణతో పాటు పనుల విషయంలో కొందరు అధికారులు సరైన చర్యలు తీసుకోకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ మాజీ సభ్యుడు డాక్టర్ ప్రేమ్‌రాజ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిశోర్ గుప్తా, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ డి.వెంకటేష్‌గౌడ్, కౌన్సిలర్లు మేకల వెంకటేష్ ముదిరాజ్, కె.ప్రవీణ్‌గౌడ్, బీజేవైఎం రాష్ట్ర నాయకుడు మహేందర్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీబీఐటీ వార్షికోత్సవాలు ప్రారంభం


ఉత్సవాలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలలో 40వ వార్షికోత్సవాలు శృతి–2023 పేరిట గురువారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను ప్రారంభించిన ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ సంవత్సరం శృతి థీమ్‌ను మీరాకి అని పెట్టామన్నారు. ఆత్మతో, సృజనాత్మకతతో, కృషితో, ప్రేమతో చేయడం అని దాని అర్థమన్నారు. ఉత్సవాలు మూడు రోజుల పాటు జరుగుతాయని, మొదటి రోజు టెక్నికల్ ఫెస్టులు, రెండవ రోజు క్రీడలు, మూడవ రోజు సాంస్కృతిక దినోత్సవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

అభివృద్ధి బాటలో శివరాంపల్లి పాఠశాల

- పాఠశాలల అభివృద్ధికి సహకారం అందిస్తున్న స్వచ్ఛంద సంస్థలు
- మన ఊరు–మన బడి కార్యక్రమంతో పూర్తి స్థాయిలో వసతులు


శివరాంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల


విద్యార్థులతో అమెరికా ఫౌండేషన్ ప్రతినిధుల బృందం

మైలార్‌దేవ్‌పల్లి: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు సహకారం అందిస్తుండడంతో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా నిలుస్తున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రంగారెడ్డి జిల్లా శివరాంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. తెలంగాణ రాష్ట్రంలో సైతం 6–10వ తరగతి వరకు 1200 మంది విద్యార్థులు, 45 మంది ఉపాధ్యాయులచే కొనసాగుతోంది. పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్నారు. వారితో పాటు స్వచ్ఛంద సంస్థలు కలిసి వస్తుండడంతో పాఠశాల రూపురేఖలు పూర్తిగా మారిపోతున్నాయి. దివంగత మాజీ హోంమంత్రి పట్లోళ్ల ఇంద్రారెడ్డి, మాజీ రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి శివరాంపల్లి పాఠశాల పూర్వ విద్యార్థులు. దీంతో విద్యా శాఖ మంత్రి పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి శివరాంపల్లి ఉన్నత పాఠశాలను మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా లక్షలాది రూపాయలు ఖర్చు చేసి పూర్తిగా ఆధునీకరించారు. ఇటీవల అంతర్జాతీయ సామాజిక సేవా సంస్థ అమెరికా వారు మ్యూజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ద్వారా 6,7,8 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేకంగా క్లాసులు తీసుకోవడం ప్రారంభించారు. మూడు సంవత్సరాల పాటు ఈ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడిస్తూ జీవన ప్రమాణాలను పెంచే విధంగా విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. డిజిటల్ రంగంలో ప్రావీణ్యం ఉన్న మీనాక్షి, టెక్నాలజీ రంగంలో విద్యార్థులకు మెలకువలు నేర్పుతున్న ఫాతిమా కృషిని శివరాంపల్లి పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు అభినందిస్తున్నారు. పాఠశాలలో పని చేస్తున్న తెలుగు భాషా పండితురాలు వీరమణి సాంస్కృతిక కార్యక్రమాలు చేపడుతూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు.